www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 10 | అక్టోబర్ | 2026
పేజీలు : 8

## నేడు జిల్లాలో ముగ్గురు మంత్రులు పర్యటన





**-ఖమ్మంలో ఎంఎల్‌సి ఎన్నికల సన్నాహాక సమావేశం**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మంజిల్లాకు చెందిన ముగ్గురు రాష్ట్ర మంత్రులు శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. వివిధ కార్యక్రమాలతో పాటు కాంగ్రెస్ ఎంఎల్‌సి అభ్యర్థి ఓట్ల చేర్పింపు, సన్నాహాక సమావేశంలో వారు పాల్గొననున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం రూరల్ మండలంతో పాటు భద్రాద్రి కొత్తగూడెంజిల్లా అశ్వారావుపేట నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

## ప్రశాంతంగా ఆర్టిసి గుర్తింపు ఎన్నికలు




**-98.04 శాతం పోలింగ్**
**-ఆర్టిసి గుర్తింపు ఎన్నికలలోనూ ప్రలోభ పర్వం**
**-నగదు, చీరలు, హాట్‌బాక్స్‌ల పంపిణీ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఖమ్మం డిపోలో స్వల్ప ఉద్రిక్తత మినహా మిగిలిన ఆరు డిపోల పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఖమ్మం డిపోలో ఒక యూనియన్‌కు చెందిన వ్యక్తి ఎంప్లాయిస్ యూనియన్ కార్యకర్తను నెట్టి వేయడంతో ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు ఆ వ్యక్తిని అరెస్టు చేయడంతో పరిస్థితి సర్దుమణిగింది. ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోల పరిధితో పాటు ఆర్‌ఎం కార్యాలయంలో ఓట్లు కలిపి 1789 ఓట్లు ఉండగా 1754 ఓట్లు పోలయ్యాయి. మణుగూరులో 240 ఓట్లకు గాను 238 ఓట్లు పోలయ్యాయి. మధిరలో 188 ఓట్లకు గాను 155 ఓట్లు పోల్ కాగా సత్తుపల్లిలో 294 ఓట్లకు గాను

మిగతా 2లో..

## తిరుమల తరహాలో శ్రీవారి ఆలయ నిర్మాణం



**-భూమి పూజకు విస్తృత ఏర్పాట్లు**
**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం భవిష్యత్తులో ఖమ్మం నగరానికే తలమానికంగా, ఒక దివ్యక్షేత్రంగా నిలవనుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆలయ నిర్మాణ స్థలం వద్ద భూమిపూజ ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ దివాకర టిఎస్, సిపి సునీల్ దత్ లతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 12న నిర్వహించనున్న శ్రీవారి ఆలయ భూమిపూజ శంకుస్థాపన మహోత్సవాన్ని అత్యంత వైభవంగా, దిగ్విజయంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ నిర్మాణం, నిర్వహణ రెండింటిని టిటిడికే అప్పగించామని తిరుమల తరహాలో ఆధ్యాత్మిక పద్దతిలో ఇక్కడ అమలవుతాయన్నారు.

మిగతా 2లో..

## సైబర్ నేరాల కేసుతో సత్తుపల్లి, వేంసూరులో కలకలం





**-ఏక కాలంలో రెండు మండలాల్లోని నిందితుల ఇండ్లలో సోదాలు**
**-బెంజ్ కారు, రెండు ల్యాప్‌టాప్‌లు,**
**-ఆరు సెల్‌ఫోన్లు, క్రెడిట్, డెబిట్ కార్డులు స్వాధీనం**
**కీలక డాక్యుమెంట్లు సీజ్**
**ఉదయం నుండి కొనసాగిన సోదాలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలో సంచలనం సృష్టించిన వెయ్యి కోట్ల సైబర్ క్రైమ్ కేసు దర్యాప్తులో బాగంగా సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని సైబర్ క్రైం నిందితుల ఇండ్లలో ఏకకాలంలో సైబర్ క్రైం సెక్యూరిటీ డి ఎస్ పి కెవిఎం ప్రసాద్ నేతృత్వంలో శుక్రవారం సోదాలు జరిగాయి. సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో ఏకకాలంలో నిర్వహించిన సోదాలు స్థానికంగా కలకలం రేపాయి. గతేడాది వీ.ఎం.బంజర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసును అధికారులు మరోసారి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో సైబర్ క్రైమ్ కేసులో నిందితుడిగా పేర్కొంటున్న సత్తుపల్లికి చెందిన బొప్పన నాగప్రసాద్ నివాసంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సోదాల్లో ఒక బెంజ్ కారు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఆరు సెల్‌ఫోన్లను, ఇతర ఆస్తి పత్రాలు, క్రెడిట్, డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వీటితోపాటు కేసు దర్యాప్తునకు ఉపయోగపడే కీలక పత్రాలను కూడా అధికారులు సీజ్ చేసినట్లు తెలుస్తోంది.

మిగతా 2లో..

## ఎసిబి వరుస దాడులు

### అవినీతి అధికారుల గుండెల్లో గుబులు



**-సివిల్ సప్లయ్ మేనేజర్ నివాసాల్లో ఏసిబి సోదాలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** అవినీతి నిరోధక శాఖ వరుస దాడులు చేస్తుంది. తమకు అందిన సమాచారంతో పాటు సేకరించిన సమాచారంతో వరుసగా దాడులు కొనసాగిస్తుండడంతో అవినీతి అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది. అక్రమంగా సంపాదించిన అనేక మంది అక్రమ సంపాదనను దాచి పెట్టడంతో పాటు ఇతరుల పేర దారి మళ్లించే ప్రయత్నాల్లో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. గడిచిన ఐదారేండ్లుగా ఖమ్మం జిల్లాలో జిల్లా స్థాయి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. మండల అధికారి మొదలు జిల్లా అధికారుల వరకు పైరవీ చేస్తేనో, పైసలు చెల్లిస్తేనో తప్ప పైలు కదల్చని పరిస్థితి. ప్రతి పైలుకు ఒక రేటు కట్టి వసూలు చేశారు. ఈ వసూళ్లలో కూడా తన మన అనే బేధం లేకుండా వసూళ్లు చేశారన్న ఆరోపణలు వినవచ్చాయి. పలు సందర్భాలలో ఆధారాలతో సహా

మిగతా 2లో..

# ప్రశాంతంగా ఆర్టిసి గుర్తింపు ఎన్నికలు





292 ఓట్లు పోలయ్యాయి. ఇల్లందులో 107 ఓట్లకు గాను 102 పోలయ్యాయి. కొత్తగూడెంలో 176 ఓట్లకు గాను 173 ఓట్లు పోలయ్యాయి. భద్రాచలం డిపోలో 333 ఓట్లకు గాను 317 ఓట్లు పోలయ్యాయి. ఖమ్మం డిపోలో 422 ఓట్లకు గాను 418 ఓట్లు పోలయ్యాయి. ఆర్ఎం కార్యాలయంలో 29 ఓట్లకు గాను 29 ఓట్లు పోలయ్యాయి. రీజియన్ పరిధిలో 98.04 శాతం ఓట్లు పోలయ్యాయి. జనరల్ ఎన్నికల మాదిరి ఆర్టిసి గుర్తింపు ఎన్నికల్లోనూ ప్రలోభ పర్వం కొనసాగింది. అధికార పార్టీ మద్దతు ఉన్న కూటమి ఖమ్మం డిపోతో పాటు మరికొన్ని చోట్ల ఓటుకు రెండువేల



నుంచి మూడువేల నగదు పంపిణీ చేయగా మహిళా ఓటర్లకు రెండువేల రూపాయల చీరలను పంపిణీ చేసినట్లు సమాచారం. కొందరు ఓటర్లకు రూ.1500 విలువైన హాట్‌బాక్స్‌లను కూడా పంపిణీ చేశారు. మొత్తంగా ప్రలోభ పర్వం జనరల్ ఎన్నికలను తలపించే రీతిలో సాగింది. అన్ని డిపోల వద్ద ఎంప్లాయీస్ యూనియన్, ఏఐటియుసి నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచే ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడంతో ఏఐటియుసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బూత్‌ల వద్ద నిలబడి ప్రచారం నిర్వహించారు.

# ఎసిబి వరుస దాడులు

**(మొదటిపేజీ తరువాయి)** అధికారులకు ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారు తప్ప చర్యలు తీసుకోలేదు. ఎప్పుడైనా ఒకరిద్దరు అధికారులు విచారణ పేరుతో ఆదేశాలు జారీ చేసి ఆ తర్వాత దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. దీనితో అవినీతికి లైసెన్స్ వచ్చినట్లయింది. గడిచిన ఐదేండ్లుగా జిల్లా పౌర సరఫరాల శాఖపై తీవ్ర ఆరోపణలు వినవచ్చాయి. రైసుమిల్లు యజమానులతో కుమ్మక్కై పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడ్డారని తెలిసినా కనీస చర్యలు తీసుకోలేదు. కొన్ని రైసుమిల్లులకు సంబంధించి కోట్ల రూపాయల కుంభకోణాలు బయటపడ్డాయి. అయినా అరకొర చర్యలతో సరిపెట్టారు. ప్రధానమైన శాఖలకు బాధ్యులుగా వ్యవహరించిన అధికారులు అధికార పార్టీ నాయకులతో అంటగాగుతూ వారి అడుగులకు మడుగులు ఒత్తుతు తమ పనిని చక్కబెట్టుకున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఎవరైనా చట్ట వ్యతిరేకంగా పనులు చేయించుకో వాలనుకున్నప్పుడు అధికారులను కలిస్తే వెంటనే ఒక అధికార పార్టీ నాయకుని చేత ఫోన్ చేయించండి అంటూ చెప్పి ఆ పనులను చక్కబెట్టుకునే వారు. వాసంశెట్టి నర్సింహారావు ఖమ్మం సివిల్ సప్లయ్‌శాఖ మేనేజర్‌గా పనిచేసినప్పుడు పలు ఆరోపణలు వచ్చాయి. సొంత నెట్‌వర్క్‌ను నిర్వహించారన్నా ఆరోపణలు వినవచ్చాయి.చివరిలో చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు సస్పెండ్ చేసి అతి కొద్ది కాలానికే తిరిగి బాధ్యతలు అప్పగించారు. ఈ దశలో అవినీతి నిరోధక శాఖాధికారులు ఏక కాలంలో నర్సింహారావుకు సంబంధించిన నివాసాలు, బంధువుల ఇండ్లలో సోదాలు చేపట్టారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లాలో ఏసిబి డిఎస్‌పి వై. రమేష్ ఆధ్వర్యంలో మహబూబాబాద్‌తో పాటు ఖమ్మం కవిరాజ్‌నగర్‌లో ఉన్న ఆయన బంధువు ఇంట్లోనూ, నేలకొండపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బి నగర్‌లో కూడా సోదాలు కొనసాగిస్తున్నారు. ఆయన ఆదాయానికి మించిన ఆస్తులు సంపాదించారన్న ఆరోపణలతోనే సోదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఏసిబి అధికారుల నుంచి సోదాలకు సంబంధించి పూర్తి సమాచారం రావాల్సి ఉంది.

# సైబర్ నేరాల కేసుతో సత్తుపల్లి, వేంసూరులో కలకలం

**(మొదటిపేజీ తరువాయి)** మరోవైపు, వేంసూరు మండలం రాజుగూడెంలోనూ సైబర్ క్రైమ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ కేసులో మరో నిందితుడిగా పేర్కొంటున్న మేడా సతీష్ కుమార్ నివాసంలో సోదాలు చేపట్టి, కేసుకు సంబంధించిన వివరాలను సేకరించినట్లు సమాచారం. వెయ్యి కోట్లకు సంబంధించినదిగా ప్రచారంలో ఉన్న ఈ సైబర్ క్రైమ్ కేసులో స్థానికంగా ఉన్న వ్యక్తుల నివాసాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. సోదాల్లో స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలు,



పత్రాలను విశ్లేషించడం ద్వారా కేసుకు సంబంధించిన మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇంతకీ ఈ సోదాల్లో లభించిన ఆధారాలు ఏమిటి? ఈ కేసులో మరెవరైనా ప్రమేయం ఉందా? స్వాధీనం చేసుకున్న పరికరాల విశ్లేషణలో ఎలాంటి అంశాలు బయటపడనున్నాయి? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలను, స్వాధీనం చేసుకున్న వస్తువులు కేసుతో ఉన్న సంబంధాన్ని అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

## అరుణోదయలో బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలతో కూడిన బతుకమ్మ పండుగను అరుణోదయ విద్యాలయంలో ఘనంగా ఆటపాటలతో ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. బతుకమ్మ పండుగ ఉద్దేశించి కరస్పాండెంట్ మాదాస్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు బతుకమ్మ పండుగ గురించి చెబుతూ ప్రకృతి సమ్మేళనంతో కూడిన బతుకమ్మ పండుగ విశిష్టత గురించి వివరించారు. ఈ బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులకు సహకరించిన ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు ప్రశంసలు తెలియజేశారు.

# వైరాలో సెపక్ తక్రా రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీలు

**అక్టోబర్ 11,12 తేదీల్లో న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో నిర్వహణ**

**ప్రజాపక్షం/వైరా:** వైరా న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాల వేదికగా ఈ నెల11, 12 తేదీల్లో 12వ తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్స్ అంతర్‌జిల్లాల సెపక్ తక్రా చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో జరిగే ఈ పోటీలకు పాఠశాల ముస్తాబైంది. ఈ విషయాన్ని ఖమ్మం జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను డాక్టర్ కాపా మురళీకృష్ణ పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి పురుషుల జట్లు, మహిళల జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. సుమారు 150 మంది క్రీడాకారులు, 10 మంది రిఫరీలు, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శితో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడా



కారులను తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల29 నుంచి నవంబర్3వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్యాలియర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని డాక్టర్ కాపా మురళీకృష్ణ తెలిపారు. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, డిసిసి చైర్మన్ నూతి సత్యనారాయణ, వైరా ఏసిపి సారంగపాణి, వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ, జిల్లా క్రీడల అధికారి సునీల్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నట్లు డాక్టర్ కాపా మురళీకృష్ణ వెల్లడించారు.

# తిరుమల తరహాలో శ్రీవారి ఆలయ నిర్మాణం



**(మొదటిపేజీ తరువాయి)**
తెలంగాణ రాష్ట్రానికి రెండు ఆలయాలు మంజూరయ్యాయని ఒకటి కొడంగల్, రెండవది ఖమ్మం నగరానికి దక్కడం ఎంతో విశేషమన్నారు. ఈ భూమిపూజ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, తాగునీటి వసతి, భోజన సదుపాయం, ట్రాఫిక్ తదితర అంశాలలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా కమిటీలను ఏర్పాటు చేసి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక పార్కింగ్ స్థలాలను భూమిపూజ ప్రాంగణం, లడ్డు, ప్రసాదాల పంపిణీ, అన్నదాన కేంద్రాలకు సంబంధించిన రూట్‌మ్యాపును సిద్ధం చేయాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూటుమ్యాపు, మార్గదర్శకాలను రూపొందించి ప్రజలకు చేరవేయాలన్నారు. ఈ భూమి పూజ మహోత్సవంలో ప్రజలు, భక్తులు స్వచ్ఛందంగా తరలి వస్తారని ఎంత మంది వచ్చినా ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టిటిడి ఈఈ సురేంద్రనాథ్‌రెడ్డి, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, మాజీ కార్పొరేటర్ రావూరి కరుణ, నాగండ్ల దీపక్ చౌదరి, ఎర్నేని రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ వేడుకలను పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, పిండిప్రోలు సర్పంచి, ఉప సర్పంచులు సువార్త, చామకూరి రాజ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారి నారాయణరావు, అధ్యాపక, అధ్యాపకేతర బృందం బతుకమ్మ సంబరాలు, సంప్రదాయబద్ధంగా, ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి.



## ఘనంగా బతుకమ్మ వేడుకలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** మండలంలోని జెడ్ వీర భద్రపురం ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు, విద్యార్థులు బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఈసందర్భంగా బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గురించి విద్యార్థులకు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోళ్ల మంగవేణి, ఉపాధ్యాయురాలు సుశీల, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి పాల్గొన్నారు.



## హెల్త్ సబ్ సెంటర్ పరిశీలన

**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సర్పంచ్ బానోత్ సదర్ లాల్ స్థానిక హెల్త్ సబ్ సెంటర్‌ను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామలక్ష్మీ ఆధ్వర్యంలో వైద్య సేవలు, సిబ్బంది విధులు, రికార్డులు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. రోజువారీ రిజిస్టర్ నిర్వహించకపోవడంపై సిబ్బందికి సూచనలు చేశారు. ఫీల్డ్ విధులు ముగిసిన వెంటనే సబ్ సెంటర్‌కు చేరుకుని, ప్రతి రోజూ కేంద్రాన్ని తెరిచి ఉంచి ప్రజలకు వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామలక్ష్మీ, సిబ్బంది రమణమ్మ, ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాశరావు, పంచాయితీ కార్యదర్శి యాకూబ్, పంచాయితీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



## కొలువుదీరిన టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్న టీపీటీఎఫ్ కూసుమంచి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా యాకయ్య, భద్రు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసమావేశానికి టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజు, ఉపాధ్యాయ దర్శిని సంపాదకుడు నాగిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లయ్య, వెంగళరావు, మహిళా ఉపాధ్యక్షురాలు సంధ్యారాణి, మండల విద్యాశాఖ అధికారి వీరస్వామి హాజరయ్యారు. పాఠశాల విద్యను బలోపేతం చేయడంతో పాటు ఉపాధ్యాయ హక్కుల కోసం సంఘటితంగా పోరాడాలని మనోహర్‌రాజు పిలుపునిచ్చారు. మండల ఉపాధ్యక్షులుగా మదనాచారి, స్వరూప, సాయికుమార్, నవీన్, కార్యదర్శులుగా శంకర్, ఉపేందర్, శివరాం, సలీమా, బిక్షం ఎంపికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కృష్ణప్రసాద్, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా శ్రీను, జీవోల కమిటీ కన్వీనర్‌గా వెంకన్న, సామాజిక మాధ్యమాల కన్వీనర్‌గా అప్పు నియమితులయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా భాస్కర్, వీరన్న, నరసింహారావు, సృజన, లక్ష్మయ్య వ్యవహరించనున్నారు.



# ఇందిరమ్మ పథకం అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



**-అర్హులందరిని ఎల్1 జాబితాలోకి చేర్చాలి**
**-పత్రాలు లేవని దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టొద్దు**
**-అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజ, కెఎంసి కమిషనర్ అభి షేక్ అగస్త్య లతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ గృహ నిర్మాణ శాఖ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలో పథకం అమలు బాధ్యత పూర్తిగా ఎంపిడివోలదేనని స్పష్టం చేశారు. ఎల్2, ఎల్0తో పాటు కొత్త దరఖాస్తులను క్షేత్రస్థాయిలో వేగంగా పరిశీలించి నిబంధనల ప్రకారం అర్హులైన వారందరినీ ఎల్1 జాబితాలోకి తీసుకు రావాలని ఆదేశించారు. భూమి పత్రాలు లేవన్న సాకుతో దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టవద్దని, విద్యుత్ బిల్లులు, గ్రామ పెద్దల సమాచారం. రెవెన్యూ నివేదికల ఆధారంగా అభ్యంతరాలు లేని భూములను నిర్ధారించి ఎల్1 స్థాయికి సిఫార్సు చేయాలని సూచించారు. ఇండ్ల నిర్మాణంలో స్లాబ్ విస్తీర్ణ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. బేస్‌మెంట్ పూర్తయి పనులు నిలిపివేస్తే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మొదటి విడతలో పనులు ప్రారంభించిన లబ్దిదారులకు నిబంధనల ప్రకారం ప్రభుత్వం చెల్లింపులు అందుతాయని తెలిపారు. ప్రతి అధికారి నిర్దేశిత నమూనాలో వాస్తవ నివేదికలు సమర్పిస్తూ అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, నియోజక వర్గ ప్రత్యేకాధికారులు, ఎంపిడివోలు, హౌసింగ్ ఏఈలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# మక్కల రైతులకు గన్నీ సంచుల డబ్బులు జమ



**ప్రజాపక్షం/ఖమ్మం:** మండలంలో మార్క్‌ఫెడ్‌కు మక్కలు విక్రయించిన రైతులకు ఖాళీ గన్నీ సంచుల చెల్లింపులు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయి. ఖాళీ గన్నీ సంచులకు సంబంధించిన డబ్బులు వస్తాయో రావో అని ఆందోళన చెందుతున్న రైతులకు ఈ చెల్లింపులతో ఊరట లభించింది. ముదిగొండ సొసైటీ ఛైర్మన్ తుపాకుల యలగొండ స్వామి ప్రత్యేక చొరవతో, రైతులకు గన్నీ సంచుల డబ్బులు చెల్లించే విషయాన్ని మార్క్‌ఫెడ్ డీఎం నర్సింహారావు దృష్టికి తీసుకెళ్లగా..అధికారులతో మాట్లాడి రైతుల ఖాతాల్లో నగదు జమయ్యేలా కృషి చేశారు. మొక్కజొన్నలు విక్రయించిన సమయంలో వినియోగించిన గన్నీ సంచుల లెక్కల ప్రకారం ఒక్కో సంచికి రూ.20.54చొప్పున చెల్లింపులు చేసినట్లు ఛైర్మన్ తెలిపారు. మండలంలోని 4,070మంది రైతులకు చెందిన 5,46,560లు గన్నీ సంచులకు సంబంధించిన మొత్తం రూ.1,12,26,342.40లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, ఖమ్మం వేర్‌హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా చేగువేరా 59వ వర్ధంతి



**ప్రజాపక్షం/మధిర:** చేగువేరా విప్లవ స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మధిర మండల కార్యదర్శి సంపసాల సాయి అఖిల, భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) మధిర మండల ఉపాధ్యక్షులు కొండూరు వెంకటకృష్ణ అన్నారు. ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంఘాల మధిర మండల సమితి ఆధ్వర్యంలో మధిర పట్టణంలో చేగువేరా 59వ వర్ధంతి సందర్భంగా చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) మధిర మండల కార్యదర్శి సంపసాల సాయి అఖిల, భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) మధిర మండలం ఉపాధ్యక్షులు కొండూరు వెంకటకృష్ణ మాట్లాడుతూ చేగువేరా ఆశయాలను, విప్లవ పోరాట స్ఫూర్తిని యువతరం ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. విప్లవం అనేది పండిన పండు మాదిరిగా దానంతట అదే చేతికి అందేది కాదని, అన్యాయంపై పోరాడి ప్రజలను సంఘటితం చేసి హక్కులను సాధించుకోవాల్సిందేనని చేగువేరా సందేశం స్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ మధిర మండల నాయకులు అశోక్, జస్వంత్, చంద్రహాస్, వివేక్, వెంకీ, నరేంద్ర పాల్గొన్నారు.

# త్వరలో పువ్వాడ నగర్‌లో ఇండ్ల స్థలాల సర్వే



**-ఎవరిని తొలగించం - సమాచార సేకరణ కోసమే సర్వే**
**-ఏడు ప్రత్యేక బృందాల ఏర్పాటు : ఆర్డీవో శ్రీనివాస్**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** పువ్వాడ నగర్‌లో త్వరలో ఇండ్ల స్థలాల సర్వే చేపట్టనున్నట్లు ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలు, ఆందోళన చెందకుండా సర్వే బృందాలకు పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. శుక్రవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009 2016 లలో ప్రభుత్వం కోయచలక పరిధిలోని సర్వే నెం.192లో దాదాపు 2వేల మందికి పైగా నిరుపేదలకు 75 గజాల చొప్పున ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిందని ఆయన తెలిపారు. ఆ ప్రాంతంలోని ఇండ్ల స్థలాలకు సంబంధించి తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలో పువ్వాడ నగర్‌లో ప్రాథమిక సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సర్వే కోసం జిపివో, ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఒక బృందంగా మొత్తం ఏడు బృందాలను ఏర్పాటు చేశామని, ఈ బృందాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు) పర్యవేక్షిస్తారని ఆర్డీవో తెలిపారు. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న వారు అసలైన పట్టాదారులా లేక ఆ స్థలాన్ని కొనుగోలు చేశారా, గిఫ్ట్‌గా వచ్చిందా, స్థలాలు ఖాళీగా ఉన్నాయా వంటి విషయాలపై క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తామన్నారు. స్థానికులు తమ వద్ద ఉన్న స్థలానికి సంబంధించిన పత్రాలతో పాటు ఆధార్ కార్డు, ఓటరు ఐడి కార్డు వంటి గుర్తింపు కార్డులను సర్వే బృందాలకు చూపించాలని సూచించారు. సర్వే జరుగుతుందన్న సమాచారంతో గృహవాసులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరిని అక్కడి నుంచి తొలగించబోమని ఆర్డీవో స్పష్టం చేశారు. కేవలం అక్కడ వాస్తవంగా ఎవరు నివసిస్తున్నారనే ప్రాథమిక సమాచారం తెలుసుకునేందుకే ఈ సర్వే చేస్తున్నామన్నారు. దీనిపై ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించామని పేర్కొన్నారు. సర్వే ప్రారంభానికి ముందు స్థానికంగా గ్రామసభ నిర్వహించి ప్రజలకు పూర్తి స్పష్టత ఇస్తామని ఆ తర్వాతే క్షేత్రస్థాయి పరిశీలన మొదలవుతుందని తెలిపారు. ఇటీవల ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండాలోనూ ఇదే తరహాలో సర్వే జరిగిందన్నారు. పువ్వాడ నగర్ సర్వే నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. ప్రజలందరూ ఎలాంటి ఆందోళన చెందకుండా అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్వేత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత మెగా పశు వైద్యశిబిరం



**ప్రజాపక్షం/మధిర:** మధిర ఎన్జీవోస్ కాలనీలో ఉచిత మెగా పశువైద్యశిబిరాన్ని మధిర మండల పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో కౌన్సిలర్ రమణనాయక్, డాక్టర్ వంశీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో స్వచ్ఛమైన పాల డిమాండ్ అధికంగా ఉంది. కావున అల్పాదాయం కలిగిన రైతులు పాడి పరిశ్రమ మీద శ్రద్ధ చూపితే ఆర్థికంగా దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీ మాట్లాడుతూ ఎదకురాని గేదెలకు చికిత్సలు, చూడి పరీక్షలు, ఎదలో ఉన్న పశువులకు, కృత్రిమ గర్భాధారణ, సాధారణ చికిత్సలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య స్టాఫ్ లక్ష్మణరావు, కిరణ్, గోపాలమిత్ర, సూపర్‌వైజర్ జావిద్, గోపాలమిత్రలు మురళజ, పిలరాజు, వెంకటకృష్ణ , రైతులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కూటమి గెలుపు ఖాయం



**ఓటు వేసిన కార్మిక సోదర, సోదరీమణులకు కృతజ్ఞతలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్ర వ్యాప్తంగా, ఖమ్మం జిల్లా రీజియన్ పరిధిలో శుక్రవారం జరిగిన ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), ఎన్ఎంయూ, టీఎంయూ కూటమి గెలుపు ఖాయమైందని కూటమి నాయకులు జి. బాల స్వామి, ఎన్.ఆర్. కృష్ణ, రాంబాబు, వై. నాగరాజు తదితరులు తెలిపారు. కూటమికి ఓటు వేసిన ఆర్టీసీ కార్మిక సోదర, సోదరీ మణులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికులకు ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించడంతో పాటు ఓటరు స్లిప్పులను పంపిణీ చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్మికులు ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఓటింగ్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం, సంస్థ పరిరక్షణ, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ సాధన కోసం కార్మికులను ఐక్యం చేస్తూ సంఘటితంగా పోరాటాలు నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు దండు ఆదినారాయణ, నిమ్మటూరు రామకృష్ణ, తడికమళ్ల యోబు, సముద్రాల సుధాకర్, జి. బాలసుబ్రమణ్యం, రాంబాబు, కాంతారావు, రాజు, కృష్ణ, రఘురాం, తిరుపతయ్య, వరలక్ష్మి , జానకి తదితరులు పాల్గొన్నారు.

# రెలు ప్రమాదంలో హోంగార్డు మృతి



**ప్రజాపక్షం/మధిర:** మధిర మున్సిపాలిటీ 20వ వార్డుకు చెందిన హోంగార్డ్ కటికల శ్రీనివాస్‌రెడ్డి మోటమర్రి రైల్వేస్టేషన్లో విధులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని మృతి చెందారు. గురువారం రాత్రి 11.45 గంటల సమయంలో మోటమర్రి రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి మొదటి ప్లాట్‌ఫామ్ నుంచి రెండో ప్లాట్‌ఫామ్‌కు వెళుతుండగా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో ఆయన మృతి చెందారు. ఈ విషాద ఘటనతో మధిర 20వ వార్డులో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇందిరమ్మ ఇళ్లలో గృహ ప్రవేశాలు

**- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవతో పేదల సొంతింటి కల సాకారం**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధిదారుల జీవితాల్లో కొత్త వెలుగులు నిండితున్నాయి. ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకుని తమ సొంత గృహాల్లోకి అడుగు పెడుతున్న కుటుంబాల్లో ఆనందోత్సహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ క్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కోయరంగాపురం గ్రామపంచాయతీ పరిధిలోని గుంటిమడుగు గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు గృహ ప్రవేశ కార్యక్రమాలు నిర్వహించారు. అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ చొరవతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. గుంటిమడుగు గ్రామానికి చెందిన బంధం రామకృష్ణ, విజయ, వర్స బుచ్చి రాజు, పెంటమ్మ, బిట్టా యర్రయ్య, లక్ష్మి కాంతమ్మ కుటుంబాలు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్లలోకి గృహ ప్రవేశం చేసి కొత్త జీవితానికి శ్రీకారం చుట్టాయి. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, అశ్వారావుపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ జూపల్లి రమేష్, జిల్లా పిసిసి సభ్యులు తుమ్మా రాంబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు : ఎంఈఓ



**ప్రజాపక్షం/వైరా:** దసరా సెలవుల సమయంలో పాఠశాలల్లో తరగతులు నిర్వహించరాదని వైరా మండల విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. వైరా మండలంలోని అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లకు ఈ మేరకు సూచనలు జారీ చేశారు. ఈ నెల10వ తేదీ నుండి 22వ తేది వరకు దసరా సెలవులు ప్రకటించిన నేపద్యంలో ఆయా యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఎట్టి పరిస్థితుల్లోను తరగతులు నిర్వహించరాదని ఆదేశించారు. సెలవుల సమయంలో పాఠశాలల్లో తరగతులు నిర్వహించినట్లు విద్యాశాఖ అధికారుల దృష్టికి వస్తే, సంబంధిత విద్యా సంస్థలపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లు ఈ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని విద్యాశాఖ అధికారులు సూచించారు.

# నేటి నుండి బతుకమ్మ సంబురాలు





**- పూల పండుగకు ముస్తాబైన జిల్లా**
**- ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా**
**- ఆడపడుచుల్లో ఆనందం**

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు నేటి నుండి ప్రారంభం కానున్నాయి. ప్రకృతిని ఆరాధిస్తూ రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడపడుచులు ఆటపాటలతో పండుగను జరుపుకోనున్నారు. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో మహిళలు యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ సంబరాలు చేసుకోనున్నారు. తంగేడు గునుగు బంతి చామంతి తదితర పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి పూజలు నిర్వహించనున్నారు. పండుగ నేపథ్యంలో మార్కెట్లో పూల కొనుగోళ్లు ఊపందుకున్నాయి.

### సంప్రదాయ పాటలు, ఆటలతో సందడి...

బతుకమ్మ వేడుకల్లో మహిళలు యువతులు సంప్రదాయ దుస్తులు ధరించి ఒకచోటచేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతారు. చప్పట్లతో లయబద్ధంగా ఆడే ఆటలు పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో కలిసి ఆనందంగా పాల్గొనడంతో పల్లెలు పట్టణాల్లో పండుగ సందడి నెలకొంటుంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు అంతా ఉత్సాహంగా పాల్గొంటూ తెలంగాణ సంప్రదాయాలను కొనసాగించనున్నారు.

### ప్రకృతి ఆరాధనకు ప్రతీక...

బతుకమ్మ కేవలం పూలపండుగే కాదు... ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే వేడుక. వర్షాకాలంలో విరబూసే వివిధ రకాల పూలను ఉపయోగించి బతుకమ్మలను పేర్చడం ఈ పండుగ ప్రత్యేకత. ప్రకృతిని గౌరవించడం సమాజంలో ఐక్యతను పెంపొందించడం వంటి సందేశాలను బతుకమ్మ పండుగ అందిస్తుంది. తెలంగాణ మహిళలు సాంస్కృతిక వైభవానికి ఆత్మగౌరవానికి ఈ వేడుక ప్రతీకగా నిలుస్తోంది.

### ఊరూ వాడా వేడుకలకు ఏర్పాట్లు...

బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించేందుకు మహిళలు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్థానికంగా జరిగే వేడుకల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు ఆసక్తిచూపుతున్నారు. చివరి రోజున నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోనున్నారు. తెలంగాణలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో నివశించే తెలంగాణ ప్రజలు సైతం తమ సంప్రదాయాలను గుర్తు చేసుకుంటూ బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. మొత్తంగా పూల పరిమళాలు సంప్రదాయ పాటలతో తొలిరోజు నుండి మొదలయ్యే ఎంగిలిపూల బతుకమ్మతో పాటు తొమ్మిదో రోజు నిర్వహించే సద్దుల బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతీ వైభవాన్ని మరోసారి చాటి చెప్పనున్నారు.

## సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన విప్లవవీరుడు చేగువేరా



**- ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్**
**- ఘనంగా 59వ వర్ధంతి**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సామ్రాజ్యవాద అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడిన ప్రపంచ విప్లవ వీరుడు చేగువేరా అని , ఆయన ఆశయాల నేటికీ సజీవంగా ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. చేగువేరా 59వ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ క్యూబా విప్లవంలో కీలకపాత్ర పోషించారని ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. వైద్య విద్యను అభ్యశించిన చేగువేరా ప్రజల కష్టాలను ప్రత్యక్షగా చూసి విప్లవబాట పట్టారని క్యూబా స్వతంత్ర పోరాటంలో కీలక నాయకునిగా ఎదిగారని గుర్తుచేశారు. విప్లవానంతరం క్యూబాలో కీలకబాధ్యలు చేపట్టినప్పటికీ ఇతర దేశాల ప్రజల విముక్తి కోసం పదవులను వదులుకుని పోరాటాన్ని కొనసాగించారన్నారు. బొలీవియాలో విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న క్రమంలో అక్టోబర్ 9న ఆయన అమరుడయ్యారని చెప్పారు. చేగువేరా త్యాగం పోరాటం ప్రపంచవ్యాతగా ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తినిస్తున్నాయని అజిత్ అన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో సన్మార్గంలో పనణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా సమితి సభ్యులు జంజునూరి రాజ్ కమల్, సుభాష్, ప్రకాష్, లక్ష్మణ్, చరణ్, కళ్యాణ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెసర పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం తగదు



**ప్రజాపక్షం/వైరా:** ఖరీఫ్ సీజన్‌లో రైతులు వర్షా లు లేక వచ్చిన కొద్దిపాటి వర్షాలకు పెట్టుబడులు పెట్టి కష్టపడి పండించిన పెసర పంటను మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వైరా వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న పెసర పంటను సందర్శించి ప్రభుత్వం కొనుగోలు పద్ధతులను రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచి మద్దతు ధరకు ప్రభుత్వం పెసర పంట కొనుగోలు చేస్తామని అనుమతులు వచ్చాయని అధికారులు చెప్పి చివరకు మార్కెట్‌కు వచ్చిన పెసర పంటను కొనుగోలు చేయడంలో రైతులను అనేక ఇబ్బందులు పెట్టడం కొనుగోలు చేయకపోవడం దురదృష్టకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మెట్ల పంటలు వేయండి అని ప్రభుత్వం అధికారులతో ప్రచారా లు చేస్తూ రైతులను మెట్ట పంటలకు ప్రోత్సహిస్తున్నారు. కాని కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సరికి పంటకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వాలు పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు వాపోయారు. తక్షణమే రైతులు పండించిన పెసర పంటను ఎలాంటి నిబంధనలు లేకుం డా రైతులను ఇబ్బందులు పెట్టకుండా పెసర పంటను కొనుగోలు చే యాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరితో పాటు రైతు సంఘం జిల్లా నాయకులు స్వర్ణ రమేష్, కొమ్మినేని శ్రీనివాసరావు, వెంకటకృష్ణారావు, కె.రామకృష్ణ, రాంపూడి సురేష్ పాల్గొన్నారు.

## జమలాపురంలో 11 నుండి 20 వరకు శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన స్వయంభు జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ పరాభవనామ సంవత్సర దేవీ శరన్నరాత్రోత్సవాలు ఈనెల 11వ తేదీ ఆదివారం నుండి 20వ తేదీ మంగళవారం వరకు నిర్వహించనున్నట్లు ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల విజయదేవశర్మ తెలిపారు. జమలాపురం ఈవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్వామి వారి ఆలయంలో ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు 9రోజులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కార్యాచరణ చేయడం జరిగిందన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతులచే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం జరుగుతుందన్నారు. 12వ తేదీ సోమవారం నిత్య పూజలు, తదితర ప్రత్యేక పూజలు, ప్రతిరోజు అమ్మవారు వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు,అభిషేకాలు, హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు, ఉప్పల శ్రీనివాసశర్మ, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు పార్టీ నుండి మద్దతు తెలపండి

### -కూనంనేనిని కోరిన తిప్పన సిద్దులు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఖమ్మం వరంగల్ నల్గొండ పట్టభద్రులు ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తిగా ఉందని, తనకు భారతకమ్యూనిస్టు పార్టీ నుండి మద్దతు తెలపాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావను తిప్పన సిద్దులు కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిద్దులు మాట్లాడుతూ తాను తెలంగాణ తొలి,మలిదశ ఉద్యమాల్లో కీలంగా వ్యవహిరించి ప్రజలను జాగృతి పరిచేందుకు తనదైన శైలిలో పోరాడినట్లు తెలిపారు. తెంలగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తనకు పదవులు ఇస్తామని చెప్పి మాటతప్పారని, తొలిమలి దశ ఉద్యమకారున్ని అయిన తనను ఇప్పటికైనా గౌరవిస్తారని ఆశించినప్పటికీ భంగపాటు ఎదురైందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రధానాచార్యునిగా పదవీ విరమణ పొందానని, తన ఉద్యోగ సమయంలోనూ ఇప్పుడూ అనేక మందిని సన్మార్గంలో నడిపేందుకు కృషి చేసినట్లు చెప్పారు. తనకు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీ చేసేందుకు పూర్తి అర్హత ఉందని, ఆసక్తి ఉందని చెప్పారు. సిపిఐ నుండి మద్దతు తెలపాల్సిందిగా కూనంనేనిని కోరడంతో సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. అదే విధంగా పిఆర్‌టియూ, పిఆర్‌టి, ఏటిఎఫ్ ప్రతినిధులు దనికొండ శ్రీనివాస్, టి వెంకటేశ్వర్లు, లక్ష్మణరావు, సత్యనారాయణ, డా.పి.మంజులను కూడా కలిసి తనకు మద్దతు తెలపాలని కోరానని వారు కూడా సానుకూల స్పందింన తెలిపారన్నారు.

## సాగునీరందక, రైతులే కాలువ పూడికతీత పనులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువ ఆర్‌డీ 21 పరిధిలోని చివరి ఆయకట్టు గంగోలు, దుమ్ముగూడెం గ్రామాల పొలాలకు సాగు నీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు స్వచ్ఛందంగా జేసీబీతో కాలువ పూడికతీత పనులు చేపట్టారు. మాజీ రైతుబంధు సమితి మండల అధ్యక్షు డు బత్తుల శోభన్ బాబు ఆధ్వర్యంలో ఈ పనులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా శోభన్ బాబు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఎండలు పెరిగే అవకాశం ఉన్నందున రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. పొలాలకు నీరు చేరే చిన్న కాలువలను శుభ్రంగా ఉంచుకుంటే సాగునీరు త్వరగా అందు తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో రైతులు గుబ్బల సుబ్రహ్మణ్యం, కుసిని రవి, పల్లపు అప్పారావు, బండారు చిన గురవయ్య, బత్తుల శ్రీను, అస్కర్ కోర్స కృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కూసుమంచి మండలం చేగొమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, ప్రకృతిపై ప్రేమ, ఐకమత్యం, సోదరభావాన్ని చాటిచెప్పాలని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. రేపటి నుంచి దసరా సెలవులు ప్రారంభం కానుండటంతో విద్యార్థుల్లో పండుగ ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గణిశాస్త్ర, సీహెచ్ రవికిరణ్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ములకలపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ములకలపల్లి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీరు అందక పత్తి పంట పూత, కాయ దశలోనే ఎండిపోతుందని, మోటార్లు ఉన్న ప్రాంతాల్లోనూ పంటలకు నీరందక భూములు బీడుగా మారుతున్నాయని తెలిపారు. వర్షాధార భూముల్లో ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులూ తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేసి బాధిత రైతులకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, గౌరీ నాగేశ్వరరావు, నిమ్మల మధు, కుంజా రాంమూర్తి, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏ కోరం కనకయ్యను కలిసిన ఎంఎల్‌సీ కాంగ్రెస్ అభ్యర్థి



**ప్రజాపక్షం/ఖమ్మం :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికైన సందర్భంగా ఎంఎల్‌ఏ కోరం కనకయ్యను ఎంఎల్‌సీ అభ్యర్థి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచార నిర్వహణ, పట్టభద్ర ఓటర్ల సమన్వయంపై ఇరువురు చర్చించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# చేగువేరా స్ఫూర్తితో పోరాటాలు సాగించాలి




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సమాజంలో జరుగుతున్న దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా చేగువేరా స్ఫూర్తితో పోరాడాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బుర్రా మనోజ్ తెలిపారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గిరిప్రసాద్ భవన్‌లో చెగువేరా 59వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ పలు దేశాలలో అణిచివేతలపై గెరిల్లా పోరాటాలు నడిపి స్వాతంత్ర ఫలాలను అందించిన ప్రపంచ విప్లవ వీరుడు చేగువేరా అన్నారు. చేగువేరా ఆశయం, పోరాటం నేటికీ సజీవ మైంద న్నారు. ఎక్కడ అసమానతలు, అణిచివేత మొదలైన అక్కడ చేగువేరా రగిలించిన విప్లవ చైతన్యం, ఎత్తిన ప్రతి పిడికిలిలో రగులుతూ జ్వలిస్తూనే ఉంటుందన్నారు. చేగువేరా స్ఫూర్తితో యువత పోరాటాలు సాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శివ, జిల్లా నాయ కులు సుభాష్, ఉమామహేష్, అభి, రోహిత్, ధోనీ, అజయ్, శ్రీరాం, వంశీ, కుమార్, రాంచరణ్, సాయి, ప్రవీణ్, లోకేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేగువేరా వర్ధంతి**




**ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో :**
ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో చేగువేరా 59వ వర్ధంతిని న్యూలైక్ కోచింగ్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ చేగువేరా స్ఫూర్తితో ఏఐవైఎఫ్ దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పని చేస్తుందన్నారు. క్యూబాలో విప్లవం తీసుకు వచ్చి లాటిన్ అమెరికా వంటి దేశాల్లో మోటార్ సైకిల్ ర్యాలీ చేసి పేద ప్రజల కోసం దోపిడీకి, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడన్నారు. దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా చేగువేరా స్ఫూర్తితో పోరాటాలు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొప్పి ఉమా, నగర అధ్యక్షులు పి. దుర్గానాథ్, నాయకులు యశ్విన్, వీరబాబు, శ్రీకాంత్, శ్రీధర్, శ్రావణి, మౌనిక, మనీషా, శ్రీలత, సునీత పాల్గొన్నారు.

# పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని పలు పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ఇవ్వడంతో పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేసి పూజలు నిర్వహించారు. సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా వేడుకల్లో పాల్గొని బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ ఛైర్మన్ సుజాత, ఉపాధ్యాయురాలు రమాదేవి, సుమలత, మల్లికార్జునరావు, వెంకటనర్సమ్మ, సుశీల, విద్యార్థులు పాల్గొన్నారు. చిమ్మపుడి అంగన్‌వాడీ కేంద్రంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. చిన్నారులు తల్లిదండ్రులతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. గణేశ్వరం పాఠశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది, ప్రీ ప్రైమరీ స్కూల్ సిబ్బంది, వంట ఏజెన్సీ సిబ్బంది, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె రఫీక్ పాషా, వెంకటేశ్వరరావు, మజహర్, విజయలక్ష్మి , కౌసల్య, రాధ, ప్రియాంక, సోమిలి, జ్యోతి, అరుణ, నాగమణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎల్. గోపాలరావు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు పులిహోర ప్రసాదాన్ని అందజేశారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ స్థాయి సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/ఖమ్మం :** పెనుబల్లి మండలం, వీఎం బంజర్ లోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఖమ్మంనల్గొండవరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బూత్ స్థాయి సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పాల్గొని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి అర్హుడైన గ్రాడ్యుయేట్ ఓటు నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు, ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఎల్ఐసీ

**ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు అయ్యేలా కృషి చేయాలి**
**మాజీ ఎమ్మెల్యే సండ్ర**

ఉద్యోగులు, వైద్య సిబ్బంది సహా అన్ని వర్గాల వారిని వ్యక్తిగతంగా కలిసి ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియను ఆన్‌లైన్‌లో త్వరితగతిన పూర్తి చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ప్రతిరోజూ ప్రజలను కలిసి ఓటు నమోదు చేయించాలని సూచించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేయించే బాధ్యతను తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కనగాల వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ చెక్కిరాల మోహన్ రావు, లక్కినేని వినీల్, కోటగిరి సుధాకర్ బాబు, మందడపు అశోక్ కుమార్, ఉద్యోగుల జేఏసీ అధ్యక్షులు టీవీ రామారావు, సర్పంచులు నారపోగు శారద, బానోతు పాప, జొన్నలగడ్డ రాంబాబు, చింతనపు శ్రీనివాసరావు, చలికాని నీలాద్రి బాబు, కొప్పుల గోవిందరావు తదితర గ్రామాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోరాడితేనే సమస్యల పరిష్కారం

**-పెన్షనర్ల పట్ల ప్రభుత్వ వివక్ష**
**-ఎస్‌జిపిఏటి అధ్యక్షులు పరిశ పుల్లయ్య**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం న్యూ హెల్త్ స్కీంను ప్రకటించి ఐదు నెలలు గడిచినా అడుగు ముందుకు పడడం లేదని ఆయన ఆరోపించారు. శుక్రవారం ఎస్‌జిపిఏటి కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వయో వృద్ధులైన పెన్షనర్ల పట్ల ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందన్నారు. సరైన రీతిలో స్పందించడం లేదన్నారు. రెండేళ్లు ఆలస్యంగా మంజూరు చేసిన డిఏకు సంబంధించి 33 వాయిదాలు ఇవ్వడం సరికాదని ఆయన తెలిపారు. హెల్త్ కార్డు అప్‌లోడ్ చేసిన పెన్షనర్ల కార్డులు రావడం లేదని దీనితో వందలాది మంది పెన్షనర్లు మనోవేదనకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఎడిట్ ఆప్షన్‌ను పెన్షనర్లకు ఇవ్వడంలో విపరీతమైన జాప్యం, హెల్త్ కార్డు వచ్చినప్పటికీ అది అమలు కావడం లేదని పుల్లయ్య తెలిపారు. పెన్షనర్ పేపర్ కావాలంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన తెలిపారు. సమావేశం ఇటీవల మరణించిన సీనియర్ పెన్షనర్లకు సంతాపం ప్రకటించి నివాళులర్పించింది. ఈ సందర్భంగా పలువురు ఎస్‌జిపిఏటి సభ్యత్వాన్ని స్వీకరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. మేరీ ఏసుపాదం, జిల్లా నాయకులు కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రాల శ్రీనివాసరావు, బోజడ్ల కృష్ణకుమారి, కొలి కొండ శరత్,జిల్లా వెంకటేశ్వర్లు,రాధాకృష్ణమూర్తి,ప్రసాదరావు,కృష్ణారావు,సుధాకర్ రావు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ

**లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు అభినందనీయం : డాక్టర్ కాపా మురళీకృష్ణ**




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు ఎస్టీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం బల్లల పంపిణీతో పాటు ఏకరూప దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. 20వ వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ వైరా, వైరా గ్రేట్ విజన్, అవని క్లబ్ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ కాపా మురళీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లా విజన్ వీక్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్‌లు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలను గుర్తించి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన బల్లలు, ఏకరూప దుస్తులు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నిర్వహించిన కౌన్సిలర్ వరలక్ష్మి శ్యామ్‌బాబును, విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేసిన సుగ్గల మాధవిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కొల్లా రాంబాబు, ఉయ్యూరు రామకృష్ణ, గద్దె నీరజ, లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, పెనుగొండ ఉపేంద్రరావు, నూకల ప్రసాద్, చింతోజు నాగేశ్వరరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, గజ్జల కృష్ణమూర్తి, చెరుకూరి శ్రీనివాసరావు, మరికంటి రాంగోపాల్, రాయల విజయలక్ష్మి , కాంగ్రెస్ నాయకులు, పువ్వల రాము, వాంకుడోత్ బికియా, దుర్గానాయక్, పండు, కుర్ర వెంకటేశ్వర్లు, రాము, దర్గయ్య, పృధ్వీ, హుస్సేన్, కాజా, తేజ, నాగేశ్వరరావు, బాలమర్తి గోపి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, కరుణతో పాటు 20వ వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి బాట పట్టిన విద్యార్థులు



**ప్రజాపక్షం/ఖమ్మం:** కల్లూరులోని ప్రభుత్వ ప్రైవేటు కళాశాల గురుకుల గిరిజనవసతి గృహ విద్యార్థులకు దసరా సెలవులు కావడంతో విద్యార్థిని విద్యార్థులు ఇంటి బాట పట్టారు. 22వ తేదీ వరకు సెలవులు కావడంతో విద్యార్థిని విద్యార్థులు ఇంటి కి తల్లిదండ్రులు వచ్చి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారులు గురుకుల కళాశాల అధికారులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు సెలవులలో తల్లిదండ్రుల చెప్పిన మాటలు వినాలని వారి అదుపులో ఉండాలని ఇష్టారీతిగా వ్యవహరించవద్దని. క్రమశిక్షణ పద్ధతిలో ఉండాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వసతి గృహ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి గృహాలకు పంపించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.

# రెండేళ్ల సమస్యకు పరిష్కారం




**ప్రజాపక్షం/ఖమ్మం:** కల్లూరులోని మహిళా సమాఖ్య మరియు ఉపాధి హామీ కార్యాలయాల కు రెండు సంవత్సరాలుగా మంచినీటి సమస్యను మున్సిపాలిటీ చైర్మన్ మోహన్ నాయక్, కమిషనర్ జి సాయి కృష్ణారెడ్డిలకు ఉషోదయ మండల సమాఖ్య అధికారిని అశోకరాణి లతోపాటు సీసీలు మరియు ఉపాధి హామీ మండల కార్యాలయం ఏపీవో హేమమాలిని టెక్నికల్ అసిస్టెంట్లు సిబ్బంది లో గత రెండు సంవత్సరాలుగా కార్యాలయాలలో నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న సమయంలో వారికి చెప్పగానే సమస్యను పరిష్కరించినందులకు కమిషనర్ మున్సిపాలిటీ చైర్మన్ మరియు పాలకవర్గానికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు





**-సోనా గృహ ప్రవేశంలో**
**ఎంఎల్ఏ పాయం**

**ప్రజాపక్షం/ఖమ్మం :** మండల పరిధిలోని తాళ్లగొమ్మూరులో తేజావత్ సోనా నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ వేడుకలో పినపాక ఎంఎల్ఏ, శాసన సభ్యులు ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎంఎల్ఏ తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో అర్హులకు సొంత ఇల్లు కల్పించడమే లక్ష్యమని, సోనా కుటుంబం సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, మండల అధ్యక్షుడు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో సీపీఐ ప్రచారం



**ప్రజాపక్షం/ఖమ్మం :** టీజీఎస్ ఆర్టీసీ ఎన్నికల సందర్భంగా ఇల్లందు బస్ డిపో వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సీపీఐ నాయకులు సందర్శించి ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు కె సారయ్య, దేవరకొండ శంకర్, బాస శ్రీనివాస్, బంటు యాదగిరి, ఆర్టీసీ డిపో అధ్యక్షుడు ఆర్ క్రాంతి, కార్యదర్శి యల్లేశ్వర్‌రావు, కోశాధికారి అక్కమ్మ, మొయినుద్దీన్, కిరణ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో బుట్టి శ్రీను మృతి

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సాబీర్ పాషా**



ప్రజాపక్షం/ఖమ్మం : సుజాతనగర్ మండలం సింగభూపాలెం గ్రామానికి చెందిన బుట్టి శ్రీను (45) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తుల్లో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. ఇటీవల బుట్టి శ్రీను సుజాతనగర్ నుంచి తన స్వగ్రామమైన సింగభూపాలెంకు వెళ్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడటంతో వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందారు. అనంతరం ఆయన పార్థివదేహాన్ని కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**నివాళులర్పించిన సీపీఐ నాయకులు...**

బుట్టి శ్రీను మృతి చెందిన విషయం తెలుసుకున్న సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, సుజాతనగర్ సీపీఐ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జక్కుల రాములు, సీపీఐ నాయకులు పొదల శీను రాజు, గోరింట్ల ధర్మ దండు నరసింహారావు తదితరులు కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ద్వారా దేవదానం పార్థివదేహా సందర్శించి కుటుంబానికి అండగా ఉండమన్నారు బాధిత కుటుంబానికి పార్టీ నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, గ్రామ పెద్దలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# శరవేగంగా భూ రీసర్వే

**రైతుల భూములకు భద్రత.. మ్యాప్‌తో కూడిన పట్టా పుస్తకాలు : జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి**



ప్రజాపక్షం/ఖమ్మం : రైతుల భూములకు స్పష్టమైన హద్దులు, యాజమాన్య హక్కులకు భద్రత కల్పించే లక్ష్యంతో జిల్లాలో భూ రీసర్వే పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని కొంగర గ్రామంలో భూ రీసర్వే చివరి రోజైన శుక్రవారం ఆయన సర్వే పనులను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సర్వే నిర్వహించిన తీరు, భూ వివాదాలు ఉన్నాయా, రైతుల నుంచి ఎలాంటి సహకారం లభించింది. సర్వే పూర్తి చేయడానికి ఎన్ని రోజులు పట్టింది తదితర అంశాలపై తహశీల్దార్‌ను ఆరా తీశారు. తదుపరి ఏ గ్రామంలో సర్వే ప్రారంభించనున్నారు, ఎన్ని బృందాలను ఏర్పాటు చేశారు. సర్వే చేయాల్సిన భూముల విస్తీర్ణం ఎంత అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అత్యాధునిక యంత్రాల సహాయంతో భూముల రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వేతో రైతులకు తమ భూములపై మరింత భద్రత ఏర్పడుతుందని, ఎవరి పేరుపై ఎంత భూమి ఉంది, భూముల హద్దులు ఎక్కడ ఉన్నాయనే విషయాలపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు నోటీసులు అందించిన అనంతరం 60 రోజుల లోపు అభ్యంతరాలు తెలియజేయవచ్చని వెల్లడించారు. సర్వే వివరాలతో పాటు మ్యాప్‌తో కూడిన పట్టా పుస్తకాలను రైతులకు అందించనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించడంతో కొంగర గ్రామంలో భూ రీసర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. భూ రీసర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి రైతు అధికారులకు సహకరించాలని జాయింట్ కలెక్టర్ కోరారు. మండలంలోని చందాపురం గ్రామంలో బుధవారం నుంచి రెండు బృందాలతో సర్వే పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి తహశీల్దార్ పి.రాంప్రసాద్, రాయగూడెం సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ సప్లై కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలి



ప్రజాపక్షం/మణుగూరు: మున్సిపాలిటీలో పనిచేస్తున్న వాటర్ సప్లై కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని టియుసిఐ జిల్లా అధ్యక్షులు ఆర్. మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కి తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) మణుగూరు బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణుగూరు మున్సిపాలిటీలో గత ఎనిమిది సంవత్సరాలుగా 14 మంది వాటర్ సప్లై కార్మికులుగా పనిచేస్తున్నారని, వారికి నేటి వరకు పిఎఫ్, ఈఎస్ఐ లాంటి తదితర చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు అమలు కాకపోవడం దారుణం అన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడం సరైంది కాదన్నారు. నెలల తరబడి జీతాలు చెల్లించకపోతే వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. దసరా లోపు వారికి జీతాలు చెల్లించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. దసరా లోపు జీతాలు చెల్లించకపోతే వారు పండుగ పూట పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధ హక్కులు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వాటర్ సప్లై కార్మికుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే భవిష్యత్తులో ఆందోళన తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, మణుగూరు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బత్తుల, వెంకటరమణ, మిట్టపల్లి. రాజేందర్, సహాయ కార్యదర్శి షఫీ ఉద్దీన్, నాయకులు కుమార్, వేముల శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ట్రేడ్స్‌మెన్ సమస్యలపై ఏఐటీయుసి గర్జన



ప్రజాపక్షం/చుంచుపల్లి: సింగరేణి కార్పొరేట్ ఏరియాలో ట్రేడ్స్‌మెన్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. టర్నర్స్, వెల్డర్స్, మిషినిస్టులకు ఫోర్‌మెన్‌గా పదోన్నతి పొందేందుకు అవకాశాలు కల్పించడంతోపాటు, టెక్నీషియన్లకు అవసరమైన పనిముట్లను వెంటనే సరఫరా చేయాలని కోరారు. శుక్రవారం సాయంత్రం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో నిర్వహించిన కార్పొరేట్ ఏరియా ట్రేడ్స్‌మెన్ సబ్‌కమిటీ సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సాంకేతిక నైపుణ్యానికి, అనుభవానికి తగిన గుర్తింపు ఇచ్చి పదోన్నతుల విషయంలో న్యాయం చేయాలని స్పష్టం చేశారు. టర్నర్స్, వెల్డర్స్, మిషినిస్టులకు ఫోర్‌మెన్‌గా ఎదిగే అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే యాక్టింగ్ ఫోర్‌మెన్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వారి అనుభవం, సాంకేతిక నైపుణ్యాన్ని పరిగణనలోకి తీసుకొని ఫోర్‌మెన్ ఇంటర్నల్ పరీక్ష రాసేందుకు అర్హత కల్పించాలని కోరారు. సింగరేణి కార్పొరేట్ సెంట్రల్ వర్క్‌షాప్, మెయిన్ వర్క్‌షాపులతోపాటు ఇతర విభాగాల్లో టెక్నీషియన్లు ఎదుర్కొంటున్న పనిముట్ల కొరతపై ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలు, యంత్రాలు, పరికరాల నిర్వహణకు అవసరమైన టూల్స్ అందుబాటులో లేకపోవడంతో ఉద్యోగులు విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యాజమాన్యం వెంటనే స్పందించి అన్ని విభాగాలకు అవసరమైన పరికరాలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం కార్పొరేట్ ఏరియా ట్రేడ్స్‌మెన్ సబ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, సముద్రాల సుధాకర్, ఉపాధ్యక్షుడు క్రిస్టోఫర్, సహాయ కార్యదర్శి రాము, ఆఫీస్ బేరర్లు నాగయ్య, నితిన్, పిట్ కార్యదర్శులు నరేష్, సుధీర్, మధుకృష్ణ, కమల్, మల్లికార్జున్, రమేష్, నాయకులు పల్నాటి ప్రశాంత్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# జూలూరుపాడు పోలీస్ స్టేషన్ తనిఖీ



ప్రజాపక్షం/జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం సందర్శించి స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని, సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, సిఐ శ్రీలక్ష్మి , ఎస్సైలు జీనత్ కుమార్, ఎస్సై మనీషా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో



ప్రజాపక్షం/ఖమ్మం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రెగ్యులర్ వైద్యున్ని నియమించాలని సిపిఐ, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా శనివారం నాడు అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించనున్నట్లు పార్టీల నాయకులు ప్రకటించారు. ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన ఈ కీలకమైన సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి , ప్రభుత్వ ఆసు పత్రికి పర్మినెంట్ వైద్యున్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత రెండు రోజులుగా దీక్షకొనసాగుతున్నప్పటికి పరిష్కారానికి స్పష్టమైన గడువుతోకూడిన హామీ వ్యకపోవడంపట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. నేడు నిర్వహించే అఖిల పక్షపార్టీల రాస్తారోకోతో నైనా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల పక్ష పార్టీల నాయకులు సర్పంచి కోరం సీతారాములు, వజ్జా ఎర్రయ్య, నరేష్, గద్దం లాలయ్య, లాలు, వీసం క్రిష్ణ, కొమరం శాంతయ్య, వాగబోయిన రమేష్, ఎస్కే షాహెద్, తోలెం గోపి, రామూర్తి, గద్దం వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో వలస కార్మికుడి మృతి

**పాఠశాల నూతన భవన నిర్మాణ పనుల్లో విషాదం.. చికిత్స పొందుతూ మృతి**



ప్రజాపక్షం/ఖమ్మం : రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం.. పొట్టకూటి కోసం సొంత రాష్ట్రాన్ని విడిచి వచ్చి కూలీ పనులు చేసుకుంటున్న యువకుడిని విద్యుత్ రూపంలో మృత్యువు కబళించింది. నిర్మాణ పనుల్లో భాగంగా పైపులు, కిటికీలు అందిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన రాజస్థాన్‌కు చెందిన సునీల్ కుమార్ (19) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటన నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో నూతన భవన నిర్మాణ పనుల వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన సునీల్ కుమార్ కాంట్రాక్టర్ వద్ద కూలీ పనులు చేసేందుకు తెలంగాణకు వచ్చాడు. కోదాడలో నివాసం ఉంటూ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరులోని సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవన పనులకు వెళ్లాడు. అక్కడ నిర్మాణ పనుల్లో భాగంగా కార్మికులకు పైపులు, కిటికీలు అందిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో వెంటనే అతడిని నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. చేతికి అందివచ్చిన యువకుడు అర్ధంతరంగా ప్రాణాలు కోల్పోవడంతో విషాదం నెలకొంది. మృతుడి సోదరుడు హనుమానరామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

# ఎక్సలెంట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



ప్రజాపక్షం/ఖమ్మం : అశ్వాపురం మండలంలోని ఎక్సలెంట్ ఈఎం పాఠశాలలో బతుకమ్మ దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి పూలతో బతుకమ్మలను అలంకరించగా, పాఠశాల ప్రాంగణం రంగవల్లులతో పండుగ శోభను సంతరించుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ లెనిన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకని, దసరా చెడుపై మంచి విజయానికి నిదర్శనమని తెలిపారు. విద్యార్థులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేయడంతో పాటు సంప్రదాయ కోలాట ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# అసంపూర్తి పాఠశాల భవనం పూర్తి చేయాలి



ప్రజాపక్షం/ఖమ్మం : కూసుమంచి ఎస్సీ కాలనీలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేసి, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని 8వ వార్డు సభ్యుడు, టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇన్‌ఛార్జి గుండా ఉపేందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఖమ్మం కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి డా వాసంతిని కలిసి సమస్యను వివరించారు. పాఠశాలలో 124 మంది విద్యార్థులు ఉండగా, మూడు గదుల్లో ఒకదాన్ని ప్రీ ప్రైమరీకి కేటాయించడంతో మిగిలిన రెండు గదుల్లోనూ ఇతర తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేసిన భవన పనులను పూర్తి చేయాలని కోరారు. స్పందించిన డీఈఓ వాసంతి, కోఆర్డినేటర్‌తో పాఠశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

# బెస్ట్ డాక్టర్ ప్రచారాలు వద్దు..!

**-ప్రైవేట్ ఆస్పత్రుల మార్కెటింగ్ మాయాజాలానికి ఎన్ఎంసీ చెక్**
**-చికిత్స ముందు..తర్వాత ఫోటోలతో ప్రచారానికి బ్రేక్**
**-గ్యారంటీ క్యూర్, పెయిడ్ రివ్యూలు, ఆకర్షణీయ ఆఫర్లపై ఆంక్షలు**
**-నిబంధనలు ఉల్లంఘిస్తే వైద్యుల రిజిస్ట్రేషన్‌పై వేటు**




**ప్రజాపక్షం/ఖమ్మం :** వైద్యం సేవా రంగమా.. వ్యాపారమా? అన్న ప్రశ్న తలెత్తేలా సాగుతున్న ప్రవేట్ ఆస్పత్రుల ప్రచార ఆర్భాటాలకు జాతీయ వైద్య మండలి(ఎన్ఎంసీ) కళ్లెం వేయనుంది. ''బెస్ట్ డాక్టర్'' ''నంబర్ వన్ హాస్పటల్'' ''100శాతం సక్సెస్'' ''గ్యారెంటీడ్ క్యూర్'' అంటూ రోగులను ఆకర్షించే అంటూ రోగులను ఆకర్షించే అతిశయోక్తి ప్రకటనలకు అడ్డుకట్ట వేస్తూ కఠిన మార్గదర్శకాలను ముందుకు తెచ్చింది. హూర్డింగులు, టెలివిజన్, సోషల్ మీడియా వేదికగా సాగే ప్రచారంతో పాటు ఇన్‌ఫ్లుయెన్సర్లు, కృతిమ మేధ(ఏఐ) సాయంతో చేసే తప్పుడు ప్రచారాలపైనా నియంత్రణ విధించింది. వైద్య సేవల వివరాలను ప్రజలకు తెలియజేయడం వేరు.. రోగుల భయాలు, అనారోగ్య పరిస్థితులను ఆసరాగా చేసుకుని ప్రచారంతో ఆకర్షించడం వేరన్న విషయాన్ని ఈ మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి.

### -ప్రచారమే ప్రమాణం కాదు!

వైద్యుల నైపుణ్యాన్ని ప్రకటనలతో కొలవలేం. అయినప్పటికీ కొందరు వైద్యులు, ఆస్పత్రులు తమ సేవలను అత్యుత్తమైనవిగా చెప్పుకుంటూ రోగులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. బెస్ట్ డాక్టర్, టాప్ స్పెషలిస్ట్, మోస్ట్ ట్రస్టెడ్ వంటి విశేషణాలతో స్వీయ ప్రచారం చేసుకోవడంపై ఎన్ఎంసీ ఆంక్షలు విధించింది. మిరాకిల్ ట్రీట్‌మెంట్, పెయిన్‌లెస్ ట్రీట్‌మెంట్, గ్యారంటీడ్ క్యూర్ వంటి హామీలతో రోగులను తప్పుదోవ పట్టించకూడదని స్పష్టం చేసింది. ఆస్పత్రులు తమ విభాగాలు, వైద్యుల అర్హతలు, సౌకర్యాలు, చికిత్స వివరాలు, ఫీజుల వంటి వాస్తవ సమాచారాన్ని మాత్రమే వెల్లడించాలి. ఆరోగ్యంపై అవగాహన పెంచే వాస్తవాధారిత సమాచారానికి మాత్రం అవకాశం ఉంటుంది.

### -ముందు ఒక ఫోటో..తర్వాత మరో ఫోటో!

చికిత్స ముందు, తర్వాత అంటూ రోగుల ఫోటోలు, శస్త్రచికిత్సల చిత్రాలు, వీడియోలను ప్రచారానికి ఉపయోగించడం వైద్య నైతికతకు విరుద్ధమని మార్గదర్శకాలు స్పష్టం చేస్తున్నాయి. రోగుల అనుభవాలు, సమీక్షలు, రేటింగ్లను ఉపయోగించి వైద్యసేవలు ప్రచారం కల్పించడం, డబ్బులు చెల్లించి నకిలీ రేటింగ్లు తెచ్చుకోవడం, పెయిడ్ రివ్యూలు చేయించడం వంట చర్యలపైనా ఆంక్షలు ఉన్నాయి. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో ప్రచారం చేయించడం, వ్యూస్ కామెంట్లు కొనుగోలు చేయడం, ఏఐతో నకిలీ రోగుల చిత్రాలు లేదా గొంతులను సృష్టించి ప్రజలను నమ్మించడం వంటి విధానాలకూ అడ్డుకట్ట వేయనున్నారు.

### -డిస్కౌంట్లతో రోగులను ఆకర్షిస్తే కుదరదు

''లిమిటెడ్ పీరియడ్ ఆఫర్'' ''తగ్గింపు ధరలు'' ''క్యాష్‌బ్యాక్‌లు, కూపన్లు, ఉచిత పరీక్షలు, బహుమతుల పేరుతో రోగులను ఆకర్షించి అవసరం లేని పరీక్షలు, వైద్య సంప్రదింపులకు ప్రోత్సహించడాన్ని నిబంధనల ఉల్లంఘనగా పరిగణించే అవకాశం ఉంది. పరీక్షలు, చికిత్సల కోసం రోగులను ఇతర కేంద్రాలకు సిఫార్సు చేసి కమీషన్లు పొందడం, బహుమతులు స్వీకరించడం కూడా నిషేధిత చర్యల పరిధిలోకి వస్తాయి. రోగికి అవసరమైన వైద్యం ఏది? దాని ప్రయోజనాలు, ఖర్చులు ఏమిటి? అన్న వివరాలు పారదర్శకంగా తెలియజేయాల్సిన బాధ్యత వైద్యులపై ఉంటుంది. వ్యాపార ప్రయోజనాల కోసం అనవసర పరీక్షలు, చికిత్సలకు ప్రోత్సహించే ధోరణికి ఈ నిబంధనలు అడ్డుకట్ట వేయనున్నాయి.

### -ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

వైద్యులు, ఆస్పత్రుల ప్రచారంపై నియంత్రణతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునే అంశానికి ఎన్ఎంసీ ప్రాధాన్యమిచ్చింది. ఉల్లంఘన స్వభావం, తీవ్రత, పునరావృతాన్ని బట్టి హెచ్చరికలు, అభిశంసన, జరిమానాలు, వైద్యుల రిజిస్ట్రేషన్ వంటి చర్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. తీవ్రమైన ఉల్లంఘనల్లో వైద్య వృత్తిని కొనసాగించే అర్హతపైనా ప్రభావం పడవచ్చు. మొత్తంగా వైద్యసేవలను వాణిజ్య ప్రకటనల పోటీగా మార్చకుండా, రోగుల ప్రయోజనాలు, వైద్య నైతిక విలువలు, పారదర్శకతకు ప్రాధాన్యమివ్వడమే ఈ మార్గదర్శకాల లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రకటనల ప్రకారం ఆర్భాటం కాకుండా చికిత్స నాణ్యత, వైద్య నైపుణ్యం, రోగుల పట్ల బాధ్యతే వైద్య రంగంలో విశ్వసనీయతకు కొలమానాలుగా, నిలవాలన్న సందేశాన్ని ఇవి ఇస్తున్నాయి.

# కండువా కప్పకుంటేనే ఇందిరమ్మ ఇండ్లా..?

**-లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ వివక్ష**
**అధికార దుర్వినియోగంపై న్యాయ పోరాటం**
**-మీడియా సమావేశంలో సిపిఎం నేత నున్నా**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇండ్ల మంజూరీ కాంగ్రెస్ కండువ కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పడం రాజకీయ వివక్షకు నిదర్శనమని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. అధికార పార్టీ రాజకీయ వివక్షకు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని పద్ధతి మార్చుకోకపోతే న్యాయ పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. అర్హులైన పేదలకు ఇండ్లు కేటాయించకుండా కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే మంజూరు చేస్తున్నారని ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన అన్నారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కాంగ్రెస్సేతర పార్టీల ప్రజాప్రతినిధులను విస్మరించి సర్పంచులు, ఇందిరమ్మ కమిటీలు సిద్ధం చేసిన అర్హులైన జాబితాలను కాదని ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని నున్నా ఆరోపించారు. ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి పోరాటం తప్పదన్నారు. కాంగ్రెస్ ఐదేండ్ల కాలంలో 20 లక్షల ఇండ్లు నిర్మించి ప్రతి కుటుంబానికి నీడ కల్పిస్తామని చెప్పారని మొదటి విడతలో ఐదు లక్షల ఇండ్లు ప్రకటించి లబ్ధిదారులను మూడు రకాలుగా వర్గీకరించారని ఇప్పుడు ఆ




వర్గీకరణను బుట్టదాఖలు చేశారన్నారు. ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజక వర్గాల్లో తొలి దశలో 16872, రెండవ దశలో 10400 ఇండ్లు మంజూరయ్యాయన్నారు. వర్గీకరణ తుడిచిపెట్టుకు పోయి వారి అనుచరులకు మాత్రమే ఇండ్లు మంజూరు చేస్తున్నారని నున్నా తెలిపారు. పలు చోట్ల ఎల్1లో ఉన్న వారిని కాదని ఎల్2, ఎల్3లో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలకు ఇండ్లు కట్టబెడుతున్నారన్నారు. కొన్ని చోట్ల ఇండ్లకు అర్హులే లేరంటూ ఇండ్లు మంజూరు చేయడం లేదని ఆయన తెలిపారు. లాటరీ పద్ధతిలో బిఆర్ఎస్ ఇండ్లు కేటాయించిందని కాంగ్రెస్ కూడా లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి త్వరలోనే జిల్లా కలెక్టర్‌ను కలవనున్నట్లు నున్నా తెలిపారు. కాంగ్రెస్ వైఖరి మార్చుకోకపోతే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు. మీడియా సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, వై. విక్రం, యర్రా శ్రీనివాసరావు, భూక్యా వీరభద్రం, మాదినేని రమేష్ పాల్గొన్నారు.

# పాడి రైతులకు రూ.1 లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విజయ డెయిరీకి పాలు సరఫరా చేసే రైతులకు గేదెల కొనుగోలు కోసం రూ.1 లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ కొడిరెక్క రవికుమార్ తెలిపారు. మండలం లోని తిరుమలాపురంలో గోపాల మిత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రుణాలపై కొనుగోలు చేసే గేదెలకు బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం లీటరు



పాలకు రూ. 92 చెల్లిస్తోందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 150 పాల సేకరణ కేంద్రాల ద్వారా 2 వేల మంది రైతులు రోజుకు 5,500 లీటర్ల పాలను సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పాడి పరిశ్రమతో రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలని, పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఆర్. శ్రీనివాసరావు, పశువైద్యాధికారి డాక్టర్ భువనేష్ కుమార్, సర్పంచ్ కమదన ప్రవీణ్ పాల్గొన్నారు.

# సంప్రదాయబద్ధంగా బతుకమ్మ సంబురాలు

**-ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు**



**ప్రజాపక్షం/ తల్లాడ :** మండల కేంద్రంలోని యూనివర్సల్ విద్యాలయంలో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. పూల పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతిని గొప్పతనాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ టికె ప్రసన్నన్ మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించడం, పూల ప్రాముఖ్యతను గుర్తించడం, సంప్రదాయాలను భావితరాలకు అందించడం బతుకమ్మ పండుగ ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో వేడుకలు ఆనందోత్సవాల మధ్య ముగిశాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మేరిసోఫియా, లావణ్య, సమత, అరుణ, హేమ, రమాదేవి, సిరి, రమ్య, ఝాన్సీ, రోహిణి, బీజాన్, గీతాంజలి, కృష్ణవేణి, ప్రమీల, మనీషా, వెంకటమ్మ పాల్గొన్నారు.

# ఘనంగా ముందస్తు బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం పినపాక గ్రామంలో డాన్‌బాస్కో స్కూల్ ఆవరణలో దసరా పండుగను పురస్కరించుకుని ముందస్తు బతుకమ్మ వేడుకలను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పాఠశాల విద్యార్థినులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులలో ముస్తాబై రంగు రంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. బతుకమ్మల చుట్టూ చేరుతూ చప్పట్లు కొడుతూ సాంప్రదాయ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. విద్యార్థినుల ఆటపాటలతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించేందుకే ఇటువంటి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** రానున్న ఎంఎల్‌సి పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు గొడుగునూరి లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం తల్లాడ పార్టీ కార్యా లయంలో పలువురు పట్టభద్రులకు ఎంఎల్‌సి ఓటు చేర్పుపై అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అనేక పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. నిరు ద్యోగులకు అండగా ఉండేందుకు నవంబర్ నుండి నిరుద్యోగ భృతి లక్ష లోపు ఇచ్చేవిధంగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని తెలిపారు. పట్టభద్రులందరూ ఆలోచించి అనుభవం కలిగిన రాంరెడ్డి సర్వోత్తమరెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్, అన్నారుగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మలపల్లి రమేష్, నాయకులు, పట్టభద్రుల ఓటర్లు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకులు



**ప్రజాపక్షం/ తల్లాడ :** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సత్తుపల్లి నియోజక వర్గంలోని తల్లాడ పట్టణంలో నిర్వహించేందుకు ఖమ్మం జిల్లా టిడిపి నాయకులను, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ను శుక్రవారం కలిశారు. తల్లాడ పట్టణంలో ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహా ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని ఖమ్మం జిల్లా టిడిపి నాయకులు మంగళగిరిలోని ఉండవల్లిలో ఉన్న నారా లోకేష్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమ వివరాలను ఆయనకు తెలియజేసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ నాయకులతో మాట్లాడి ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నందుకు వారిని అభినందించారు. తల్లాడ పట్టణంలో ఎన్‌టిఆర్ విగ్రహా ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంటరీ టిడిపి ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ అడహక్ కమిటీ సభ్యుడు కేతినేని హరీష్, నాయకులు పృథ్వీ, బాబు, మాజీ టిడిపి మండల అధ్యక్షుడు భద్రరాజు, టిడిపి మండల అధ్యక్షుడు శ్రీనివాసరాజు, మండల నాయకులు పాల్గొన్నారు.

# రాకేష్‌రెడ్డి గెలుపునకు బీఆర్ఎస్ ప్రచారం

**ప్రజాపక్షం/కారేపల్లి:** రాబోయే ఎంఎల్‌సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయమే లక్ష్యంగా వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మీ మదన్‌లాల్ సింగరేణి మండల కేంద్రంలో పర్యటించారు. పట్టభద్రులను కలిసి అభ్యర్థి గెలుపునకు మద్దతు కోరుతూ దరఖాస్తు ఫారాలు నింపించారు. ఈకార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు డొంకెన రవీందర్, ఉప సర్పంచ్ లాలు, సూర్యతండా మాజీ సర్పంచ్ జరుపుల అచ్చు, రావోజీతండా మాజీ సర్పంచ్ మోహన్, యువజన నాయకులు సోమందుల నాగరాజు, పేర్ని వెంకటేశ్వర్లు, జడల కళ్యాణ్, గుగులోత్ జిమ్‌కీలాల్, పోకిలి యుగంధర్, పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, పొడుగు హరీష్, భూక్య మధు, ధరావత్ రాకేష్, ధరావత్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.